సాక్షి
పెద్దపల్లి
శనివారం । 8 । జూలై । 2023



ఘనంగా పెద్దమ్మ పట్నాలు

సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నర్స య్యపల్లిలో శుక్రవారం పెద్దమ్మ పట్నాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



సాంబశివాలయంలో హోమం

సుల్తానాబాద్: ఆషాఢ మాసం పురస్కరించుకొని సాంబశివాలయంలో శుక్రవారం హోమం నిర్వ హించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్ర సాదాలు స్వీకరించారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సంకెళ్లతో దంపతుల పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న దంపతులు

గోదావరిఖని: మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుతూ చంద్రాపూర్‌కు చెందిన మస్కెబాబు–శోభారాణి దంపతులు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం గోదావరిఖనికి చేరుకుంది. చేతికి సంకెళ్లు, నల్ల దుస్తులు ధరించారు. వీరికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్వాగతం పలికారు. అనంతరం దంపతులు మాట్లాడుతూ మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుతూ చంద్రాపూర్ నుంచి ప్రగతిభవన్‌ను వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

వకీల్‌పల్లి గనిని సందర్శించిన ఆర్‌అండ్‌డీ జీఎం



అధికారులతో మాట్లాడుతున్న సుభాని

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని వకీల్‌పల్లి గనిని ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని శుక్రవారం సందర్శించారు. ఆర్జీ–2 జీఎం మనోహర్, గని గ్రూప్‌ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమై గనిలోని పనిస్థలాల తీరుపై పరిశీలించారు. సర్వే మ్యాప్ ద్వారా ఫోర్‌సీమ్‌లో నడిస్తున్న కంటిన్యూస్ మైనర్ ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. కంటిన్యూస్ మైనర్‌ప్లాన్–2 అనుమతులు, శాస్త్రీయ విధానం, ప్రణాళికలు తదితర విషయాలపై చర్చించారు.

రెండో రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల సమ్మె



పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. వేతనాల పెంపు ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దుపర్చాలన్నారు. నాయకులు అంజయ్య, ఖాజా, తిరుపతి, ఓదెలు, కనకయ్య, రాజయ్య, శ్రీనివాస్, అశోక్, శారద, మల్లేశం, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పదినెలల రెసిడెన్షియల్) కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్వతీ పంపుహౌజ్‌లో నిలిచిన ఎత్తిపోతలు

రామగుండం: పార్వతీ పంపుహౌజ్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలను శుక్రవారం నిలిపివేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో పాటు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పడుతున్న వర్షాలతో సాగు అవసరాలు తీరుతున్నందున ఎత్తిపోతలను నిలిపివేసినట్లు తెలిసింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు 20.175 సామర్థ్యం కాగా ప్రస్తుతం 12.24 టీఎంసీలు. ప్రాజెక్టు నుంచి ఔట్‌ఫ్లో 6,631 క్యూసెక్కులుగా ఉంది.

పత్తి క్వింటాల్ ధర రూ.6,751

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం పత్తి క్వింటాల్ ధర రూ.6,751 పలికింది. కనిష్ఠ ధర రూ.6,220 పలకగా సరాసరి ధర రూ.6,717గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

‘బడుగు’ వీరులు ఎవరో?

- తొలుత బీసీలకే టికెట్లని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటన
- పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు అవకాశం
- గంపెడాశలతో ఉమ్మడి జిల్లాలో ఆశావహులు
- ఎవరిని ప్రకటిస్తారోనని ఉత్కంఠ
- ఆసక్తికరంగా రాజకీయాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడ్డ అంశాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు టీపీసీసీ కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగానే టికెట్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం కర్ణాటక మాదిరిగా బీసీ ఫార్ములాను అనుసరించాలని నిర్ణయించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల టికెట్లే ప్రకటిస్తామని పునరుద్ఘాటించారు. ఈప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో ఉత్కంఠ నెలకొంది. కర్ణాటకలో అనుసరించిన విధంగానే ప్రతీ పార్లమెంటు సెగ్మెంటుకు ఇద్దరు బీసీలకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది. పాత జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లితోపాటు నిజామాబాద్ పార్లమెంటు (జగిత్యాల, కోరుట్ల) సెగ్మెంట్లు వస్తాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో మొత్తంగా చూస్తే కేవలం ఐదుగురికి మాత్రమే చోటు దక్కేలా ఉంది. ఈ ఐదాగురిలో ఎవరిని టీపీసీసీ కరుణిస్తుందో అన్న చర్చ మొదలైంది.





వేములవాడ: ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్ పార్లమెంటు బీసీ సామాజిక వర్గం కోటాలో టికెట్ ఆశిస్తున్నవారిలో ముందువరుసలో ఆది శ్రీనివాస్ ఉంటారు. మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ వేములవాడ నుంచి గత 2009, 2010, 2014, 2018 నాలుగు పర్యాయాలు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇందులో సార్వత్రిక ఎన్నికలు కాగా ఒక ఉప ఎన్నిక ఉంది. ప్రతీసారి విజయం కోసం వీరోచితంగా పోరాడుతున్న ఆది శ్రీనివాస్ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న కసితో ఉన్నారు. సుదీర్ఘకాలంగా పోటీ చేస్తుండటం, ప్రజల్లో సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న కొత్త ఊపు తనకు కలిసి వస్తుందని ధీమాగా ఉన్నారు.

కరీంనగర్: పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో పొన్నం ప్రభాకర్ కూడా ఒకరు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నుంచి ఇద్దరు బీసీలకు టికెట్లు ఇవ్వాల్సి వస్తే.. అందులో పొన్నం ప్రభాకర్ కూడా ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. బీసీల్లో బలమైన గౌడ సామాజిక వర్గానికి చెంది ఉండటం, గతంలో ఎంపీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసి ఉండటం పార్టీలోనూ పలు కీలక పదవులు నిర్వహించిన అనుభవం ప్రభాకర్ సొంతం. కరీంనగర్ అసెంబ్లీ నుంచి పలువురు వ్యాపారవేత్తలు టికెట్లు అడుగుతున్న క్రమంలో ఆయన ఎంపీగా కాంటెస్ట్ చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు.

పెద్దపల్లి: గంటా రాములు యాదవ్

పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో బీసీ కోటాలో టికెట్ ఆశిస్తున్న మరో నాయకుడు గంటా రాములు యాదవ్. టీడీపీ నేతగా ఉమ్మడి జిల్లాలో తనకంటూ గుర్తింపు సాధించుకున్నారు. 22 ఏళ్లగా ప్రతీసారీ ప్రతిపక్ష పార్టీలో ఉంటూ స్థానిక సంస్థల నుంచి విజయాలు సాధిస్తూ వస్తున్న రికార్డు ఆయన సొంతం. తెలుగుదేశం నుంచి రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌లో చేరిన రాములు.. ఈసారి ఎలాగైనా ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన నేత కావడం, పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటాలో తనకు అవకాశం దక్కుతుందని పేర్కొంటున్నారు.

రామగుండం: మక్కాన్‌సింగ్ ఠాకూర్..

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ది ప్రత్యేక స్థానం. 2004 నుంచి 2009 వరకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్‌గా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ రెబెల్‌గా, 2018 కాంగ్రెస్ అభ్యర్థిగా రామగుండం ఎమ్మెల్యే సీటు కోసం పోటీచేశారు. తాజాగా మరోసారి కూడా ఆయన ఇక్కడ నుంచే పోటీకి సిద్ధపడ్డారు. పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటా అమలు, పార్టీలో సీనియర్ నాయకుడిగా అనుభవం, రామగుండం స్థానికుడు కావడంతో తనకు టికెట్ గ్యారెంటీ అన్న ధీమాలో ఉన్నారు.

కోరుట్ల: కొమొరెడ్డి కరమ్‌చంద్..

తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు కుమారుడు కొమొరెడ్డి కరమ్. ఈయన తనకు కోరుట్ల టికెట్ కావాలని కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. పార్టీకి తన తండ్రి చేసిన సేవలు, నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వాల్సి రావడం తనకు కలిసి వస్తాయని ఆశాభావంతో ఉన్నారు. బీసీల్లో బలమైన సామాజికవర్గం అయిన మున్నూరు కాపు కావడం తనకు అదనపుబలంగా భావిస్తున్నారు.

భూ క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఎస్.సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో భూ క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిటల్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో పలు అంశాలపై శుక్రవారం సమీక్షించారు. భూముల క్రమబద్ధీకరణ కటాఫ్ తేదీని 2 జూన్ 2020కు పొడిగిస్తూ జీ ఐఓ58, 59 ,76 కింద ప్రభుత్వం మరోమారు దరఖాస్తు(్ల)జీ స్వీకరించిందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఎస్ సంగీత భూ సంబంధిత అంశాలపై తహసీల్దార్‌లతో చర్చించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో జీవో 58 కింద 1,414 దరఖాస్తులు, జీవో76 కింద 1,893 దరఖాస్తులు, జీవో59 ద్వారా వచ్చిన దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. రెవెన్యూ బృందాలు ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించి టాంటాం చేసి గ్రామాల వారీగా మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపు నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపిక చేయాలని అన్నారు. సమావేశంలో ఆర్డీవో కె. వీరబ్రహ్మాచారి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్

ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు నష్టపరిహారం చెల్లింపులపై చర్చించారు. జిల్లాలో 97 కేసులకు ప్రభుత్వం రూ.70.95లక్షల పరిహారం మంజూరు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 56 మందికి రూ.35 లక్షల పరిహారం అందించామన్నారు. కేసులు పెండింగ్‌లో ఉండేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా 30న పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వీరబ్రహ్మాచారి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి నాగలేశ్వర్, ఏసీపీ ఎడ్ల మహేష్, సీఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో దేశానికే ఆదర్శం



జూలపల్లి(పెద్దపల్లి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలిచిందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కీచులాటపల్లెలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ, బీసీ కమ్యూనిటీ భవనాలకు, సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, వైస్ చైర్మన్ రమేశ్, ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ కొత్త శకుంతల, ఎంపీటీసీలు తమ్మడవేని మల్లేశం, కత్తెర్ల శ్రీనివాస్, కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, నాయకులు చొక్కారెడ్డి, రాములు, జ్యోతిబసు, తిరుపతి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కోసమే ఐటీపార్కు

- 13 నుంచి దశాబ్ది ప్రగతి ప్రజా చైతన్య పాదయాత్ర
- రామగుండం ఎమ్మెల్యే చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: యువతకు ఉపాధి కోసమే రామగుండం నియోజకవర్గంలో ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సాధించుకున్నామన్నారు. మంత్రి కేటీఆర్ ప్రోత్సాహంతో రామగుండంలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలనే తలంపుతో అమెరికాలో ఐటీ పారిశ్రామికవేత్తలతో భేటీ కావడానికి డల్లాస్ వెళ్లాలని తెలిపారు. మూడు రోజుల పర్యటనలో ఎంతో మంది ఐటీ శాఖ సంస్థల వ్యవస్థాపకులు, సాంకేతిన నిపుణులైన ప్రవాస భారతీయులను కలిసినట్లు తెలిపారు. రామగుండం ఎన్నారై డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేసి ఇక్కడ నిరుద్యోగ యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి కోసం త్వరలోనే ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 13 నుంచి రామగుండం దశాబ్ది ప్రగతి ప్రజా చైతన్య పాదయాత్రకె నిర్వహించనున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ సాగంటి శంకర్, నాయకులు పీటీ స్వామి, నడిపెల్లి అమరేందర్‌రావు, అడ్డాల రామస్వామి, తిరుపతినాయక్, పర్లపల్లి రవి, వంగ శ్రీనివాస్‌గౌడ్, జహీద్‌పాషా, నారాయణదాసు మారుతి, జేవీరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం మార్కండేయకాలనీలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రామగుండం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కమిటీ నియామక పత్రాలు అందజేశారు. నూతన కమిటీ బాధ్యులు కట్ట గోపాలాచారి, మహేందర్‌చారి, ముల్కల గోవర్ధనశాస్త్రి, రాజమౌలేశ్వరచారి, కట్ట సురేష్‌భవాని పాల్గొన్నారు.

తర‘గని’ సంకల్పం..!

- మైనింగ్ వైపు యువతుల చూపు
- మైనింగ్ కోర్సులో పెరిగిన విద్యార్థినుల సంఖ్య
- అవకాశం కల్పిస్తున్న మంథనిలోని జేఎన్‌టీయూ



జేఎన్‌టీయూ కళాశాల ల్యాబ్‌లో మైనింగ్ విధానంపై వివరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

కమాన్‌పూర్(రామగిరి): టెన్త్, ఇంటర్ తర్వాత ఏ కోర్సు చేస్తే బాగుంటుందనేది అందరి ఆలోచన. ఈ క్రమంలో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కొత్త కోర్సుల అన్వేషణలో విద్యార్థులు, తల్లిదండ్రులు దృష్టి సారిస్తుంటారు. ఎక్కడికో దూర ప్రాంతాలకు వెళ్లి ఇంజినీరింగ్‌లో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఆటోమొబైల్, ఇంకా వృత్తి విద్యాకోర్సుల్లో చేరుతుంటారు. ఆ కోర్సులు పూర్తిచేశాక కార్పొరేట్ కంపెనీలో మంచి ఉద్యోగం.. ఆకర్షణీయమైన వేతనం .. బెటర్ లైఫ్ ఉంటుందన్న నమ్మకం. ఇంకా అదృష్టం కలిసి వస్తే విదేశాలకు కూడా వెళ్లొచ్చని ఆశ పడటం సహజం. అయితే.. ఈ విద్యార్థినులు సరికొత్తగా ఆలోచన చేశారు. అత్యంత క్లిష్టమైన మైనింగ్ విద్యను ఎంచుకున్నారు. ఎంత కష్టమైనా సరే ఇష్టంతో ముందుకుసాగాలని అనుకున్నారు. వీరికి మంథని జేఎన్‌టీయూ మంచి అవకాశం కల్పిస్తోంది. ఈ విద్యా సంవత్సరం మైనింగ్ విద్యలో ఊహించని విధంగా 33 శాతం ప్రవేశాలు పెరిగాయి. గనిలోకి దిగి తామేంటో నిరూపించాలని కొందరు.. సింగరేణి సంస్థతో విడదీయని బంధంతో ఇంకొందరు.. భావి ఇంజినీర్లుగా ఎదగాలన్న తర ‘గని’ సంకల్పంతో మైనింగ్ విద్యలో చేరారు.

సింగరేణికి వుమెన్ పవర్

ఒకప్పుడు సింగరేణి గనులంటే కేవలం పురుషులు మాత్రమే పనిచేసేవారు. సర్ఫేస్‌లో మహిళలు చాలా అరుదుగా కనిపించేవారు. భూగర్భగనుల్లో బొగ్గు వెలికితీసే పని స్థలాలు అత్యంత ప్రమాదంతో కూడుకున్నవి కావడంతో అప్పటి ప్రభుత్వాలు గనుల చట్టం ప్రకారం మహిళలను గనుల్లోకి పంపించలేదు. రానురాను గనుల చట్టంలో మార్పులతో మహిళలు కూడా తమ సత్తా చూపించుకునే అవకాశం వచ్చింది. సింగరేణి సంస్థ కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గనుల్లో యాంత్రీకరణను అభివృద్ధి చేసింది. మహిలలను సైతం గనుల్లోకి దింపేందుకు నిర్ణయించింది. దీంతో చాలామంది యువతులు మైనింగ్ విద్య వైపు దృష్టి సారిస్తున్నారు. 2014లో రామగిరి మండలం సెంటినరీకాలనీలో ప్రారంభించిన జేఎన్‌టీయూలో మొదట కంప్యూటర్ కోర్సుల్లో మాత్రమే విద్యార్థినులు ఆసక్తి చూపించారు. అయితే మైనింగ్ విద్య పూర్తి చేశాక సింగరేణిలో మంచి ఉద్యోగాలు వస్తుండడంతో ఇప్పుడు చాలామంది యువతులు మైనింగ్ విద్య ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం కళాశాలలో 46 మంది విద్యార్థినులు మైనింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. భవిష్యత్‌లో సింగరేణి గనిలోకి దిగి తామేంటో నిరూపిస్తామని గర్వంగా చెబుతున్నారు.

భవిష్యత్‌పై నమ్మకంతో..

ఓసీపీ గనుల్లో యువతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సాధారణంగా ఇంటర్ పూర్తయ్యాక హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ కోర్సులను ఎంచుకోవడం పరిపాటి. ఈ మధ్యకాలంలో సాఫ్ట్‌వేర్ రంగం ఎప్పుడు కుదేలవుతుందో తెలియని పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థినులు అత్యంత క్లిష్టమైన మైనింగ్ విద్య వైపు వస్తున్నారు. ఒక్కసారి ఉద్యోగం సాధిస్తే ఇక్కడ భవిష్యత్ బావుటుందని భావిస్తుండడమే కారణంగా తెలుస్తోంది.

ఉద్యోగావకాశాలు ఎక్కువ



మైనింగ్ విద్యలో చేరడానికి విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. మొన్నటివరకు 24 మంది చేరితే ఇప్పుడు 46కు చేరారు. మైనింగ్ కోర్సు చేసిన వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువ. అందుకే డిప్లొమా చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. – విష్ణువర్ధన్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్

ఏదైనా సాధిస్తాం



మైనింగ్ అంటే ఇంజినీరుతో సమానంగా ఉంటుంది. ఇంజినీర్లు చేసే ఏ పనైనా మైనింగ్ విద్యార్థులు చేయవచ్చనే సంకల్పం మాకుంది. అందుకే మైనింగ్ ఇంజినీరింగ్ చేస్తున్న. ప్రస్తుతం కళాశాలలో ఫోర్తియర్ చదువుతున్న.

– శైనీ, మైనింగ్ ఫోర్తియర్

అన్నయ్య ప్రోత్సాహంతో..



మాది నల్గొండ జిల్లాకేంద్రం. మా అన్నయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. అన్నయ్యకు మైనింగ్ విధానం గురించి తెలుసు. మైనింగ్ చేయమని చెప్పడంతో మైనింగ్ డిప్లొమా చేస్తున్నాను.

– పూజిత థర్డియర్

తాత మాటతోనే..



మాది రామగిరి మండలం కల్వచర్ల గ్రామం. మా తాత సింగరేణి ఎంప్లాయ్. చిన్నప్పుడు బొగ్గుబాయి దగ్గరికి తీసుకుపోతుండే. బొగ్గు గనులు చూపించేవాడు. ఆయన ప్రోత్సాహమే కోర్సువైపు నడిపిస్తోంది.

– మానస, మైనింగ్ సెకండియర్, కల్వచర్ల

డిఫరెంట్‌గా ఉంటుందని..



సింగరేణిలో మైనింగ్ ఎలా ఉంటుందో తెలుసుకున్నాను. మైనింగ్ అంటేనే డిఫరెంట్. మైనింగ్ అంటే పురుషులు మాత్రమే చేయాలని లేదు. పట్టుదలతో ముందుకెళ్లాలి. ఓసీపీ–3లో 15 రోజులు శిక్షణ తీసుకున్నాను.

– మౌనిక ఫోర్తియర్, సూర్యాపేట

మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందనే భయంతో అక్రమ కేసులు నమోదు చేసి గుజరాత్‌కోర్టు రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా స్టేరిజెక్ట్ చేయడాన్ని ఖండించారు. రాహుల్‌గాంధీకి న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు. మహిళా కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు. కాగా ఇదే సమయంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అనుచరులతో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసేందుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య నినాదాలు మిన్నంటాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని అక్కడినుంచి పంపించివేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో 76.95 శాతం ఉత్తీర్ణత

పెద్దపల్లిరూరల్: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 76.95 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా నుంచి 629 మంది విద్యార్థులు హాజరు కాగా 484 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. బాలురలో 74.72 శాతం, బాలికల్లో 79.93 శాతం, మొత్తం 76.95 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఫ్లెక్సీల్లో తెలుగు భాషకు చోటు లేదా?

- తెలుగు పదాలను మరిచిన మహారత్న ఎన్టీపీసీ



హిందీ, ఇంగ్లిష్ పదాలతో ఉన్న ఫ్లెక్సీ

జ్యోతినగర్(రామగుండం): దేశ భాషలందు తెలుగు లెస్సగా పిలుచుకునే మన భాషకు ఎన్టీపీసీ మహారత్న రామగుండం ప్రాజెక్టులో చోటు లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం హిందీ, ఇంగ్లిష్‌లో కార్యక్రమాలను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొన్న కార్యక్రమంలోనూ తెలుగు పదాలున్న ఫ్లెక్సీ ఒక్కటీ కనిపించలేదు. ఈ ప్రాంతంలో ఉన్న కంపెనీలు తమ వివరాలను తెలియజేసే బోర్డులపై స్థానిక ప్రజల వాడుక భాషతోపాటు హిందీ, ఇంగ్లిష్‌లను ఉపయోగించడం ఆనవాయితీ. కానీ ఎన్టీపీసీలో దీన్ని పట్టించుకోకపోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన నల్ల సతీశ్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గోదావరిఖని టూటౌన్ పోలీసులు గుర్తించి, బాధితుడికి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సతీశ్ తన సెల్‌ఫోన్‌ను పోతనకాలనీ నుంచి యైటింక్లయిన్ కాలనీ వైపు వెళ్లే దారిలో పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, ఫోన్‌ను గుర్తించారు. రెండో సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై చంద్రశేఖర్ సతీశ్‌ను శుక్రవారం పిలిపించి, సీఐ వెణుగోపాల్ చేతులమీదుగా ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా అతను పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

పొలంలోనే శవమయ్యాడు..

- అనుమానాస్పద స్థితిలో రైతు మృతి
- బంధువులే హత్య చేశారంటున్న మృతుడి భార్య
- భూతగాదాలే కారణం?
- శివుపల్లిలో ఘటన


వెంకట్రావు (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎలిగేడు(పెద్దపల్లి): ఓ రైతు తన పొలంలోనే శవమైన ఘటన ఎలిగేడు మండలంలోని శివుపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివుపల్లికి చెందిన దుగ్యాల హన్మంతరావు మొదటి భార్య లక్ష్మి 35 ఏళ్ల క్రితం మృతిచెందగా సుల్తాన్‌పూర్‌కు చెందిన విజయను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా, హన్మంతరావు తనకున్న 6 ఎకరాల వ్యవసాయ భూమిలో మొదటి భార్య కుమారుడు వెంకట్రావు(43)కు 16 ఏళ్ల క్రితం రెండున్నర ఎకరాలు కాగితంపై రాసిచ్చి, మిగతాది తన పేరిటే ఉంచుకున్నాడు. 11 నెలల క్రితం హన్మంతరావు అనారోగ్యంతో మృతిచెందగా ఆయనకు వారసులు ఎవరూ లేరని రెండో భార్య విజయ తన సమీప బంధువుల సహకారంతో 6 ఎకరాలనూ తన పేరిటే పట్టా చేసుకుంది. దీంతో వెంకట్రావు కోర్టులో పిటిషన్ వేశాడు. ఈ విషయమై పలుమార్లు పంచాయితీలు జరిగాయి. కానీ విజయ పెద్ద మనుషుల మాట వినలేదు.

పొలం నాటు వేయించేందుకు వచ్చి..

వెంకట్రావుకు భార్య సమత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లల చదువుల కోసం అతను కుటుంబసభ్యులతో కలిసి రెండేళ్లుగా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. తండ్రి తనకు రాసిచ్చిన రెండున్నర ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు గురువారం శివుపల్లికి వచ్చి, దున్నించాడు. రాత్రి కావడంతో శివుపల్లిలోనే ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం పొలం నాటు వేద్దామని, ఉదయాన్నే రమ్మని భార్యకు ఫోన్ చేసి, చెప్పాడు. సమత ఉదయం భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన ఆమె తమ పొలం పక్కనున్న రైతు వేల్పూరి రమేశ్‌కు ఫోన్ చేసింది. పొలం వద్ద వెంకట్రావు బైక్ ఉంది.. కానీ అతను కనిపించడం లేదన్నాడు. దీంతో ఆమె ఆందోళనకు గురై, కరీంనగర్ నుంచి హుటాహుటిన శివుపల్లి చేరుకుంది. భర్త కోసం వెతకగా వారి పొలంలోనే శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. సమీప బంధువులే హత్య చేశారని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పొలం నాటు వేద్దామని చెప్పిన వెంకట్రావు తెల్లవారేసరికి మృతిచెందడంతో భార్య, కూతుళ్లు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

‘డబుల్’ హామీ అమలులో ప్రభుత్వం విఫలం

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


ఇల్లు లేని పేదలతో కలిసి డీటీకి వినతిపత్రం ఇస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విఫలమయ్యారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆరోపించారు. శుక్రవారం ఎలిగేడు మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తుదారులతో కలిసి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో వేలాది ఇళ్లు నిర్మించి, అక్కడి ప్రజలకు ఇచ్చారన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మాత్రం ఇక్కడి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేసీఆర్‌ను అడిగి ఇళ్లు తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల నుంచి 1,100 పైగా దరఖాస్తులను స్వీకరించి, అర్జీదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం వాటిని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.

జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు

ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం మద్దతు ప్రకటించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచి, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, గోపగాని సారయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, సాయిరి మహేందర్, దుగ్యాల సంతోష్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజా, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

సింగరేణిలో జాతీయస్థాయి మైన్స్‌రెస్క్యూ పోటీలు

- నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు ఆతిథ్యం
- దేశవ్యాప్తంగా 18 కంపెనీల నుంచి ప్రతినిధుల హాజరు
- సమీక్షా సమావేశం నిర్వహించిన సింగరేణి డైరెక్టర్లు


సమావేశంలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్లు

గోదావరిఖని: జాతీయస్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలను ఈసారి సింగరేణి యాజమాన్యం నిర్వహించనుంది. ఈపోటీలు నవంబర్ 27 నుంచి డిసెంబర్ ఒకటి వరకు జరగనున్నాయి. పదేళ్ల త్వరాత ప్రతిష్ఠాత్మక పోటీలకు సింగరేణి సంస్థ మరోమారు ఆతిథ్యం ఇవ్వనుంది. జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సంబంధించిన శుక్రవారం హైదరాబాద్‌లోని జరిగిన సన్నాహక సమావేశంలో మైన్స్ రెస్క్యూ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంఎస్ శ్యామ్ మిశ్రా, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్ ప్రసాద్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగరేణి నుంచి డైరెక్టర్ ఆపరేషన్ ఎన్వీకే శ్రీనివాస్, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, సేఫ్టీ జీఎం గురవయ్య, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, ఎనిమిది కోల్ ఇండియా బొగ్గు సంస్థల ప్రతినిధులు, యూరేనియం, జింక్, కాపర్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జాతీయస్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల్ని ఏటా ఒక సంస్థ ఆతిథ్యం ఇస్తుంది. ఈసారి సింగరేణికి అవకాశం దక్కింది. ఈసందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ రెస్క్యూ విభాగాన్ని పూర్తిగా ఆధునికీకరించిందని, జాతీయస్థాయిలో జరిగిన రెస్క్యూ పోటీల్లో చాంపియన్ షిప్ సాధించాయన్నారు.

25 జట్లు.. 5 రోజులపాటు పోటీలు

నవంబర్ 27వ తేదీ నుండి డిసెంబర్ ఒకటో తేదీ వరకు ఆర్జీ–2లోని మెయిన్ రెస్క్యూస్టేషన్, 7ఎల్ఈపీ గనిలో 5 రోజులపాటు పోటీలు ఉండనున్నాయి. పోటీలకు 10సంస్థల నుండి సుమారు 25 జట్లు పాల్గొనబోతున్నాయి. పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాటు చేయనుంది.

కారుణ్య నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియాలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై, మెడికల్ అన్‌ఫిట్ ఆయన వారి కుటుంబాలకు చెందిన ఐదుగురికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పిస్తూ కారుణ్య నియామక పత్రాలను జీఎం కె.సుధాకర్‌రావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం రావడం ఒక వరమని, వచ్చినవారు చెడు వ్యసనాలకు బానిసై, విధులకు గైర్హాజరు కావొద్దన్నారు. ఉద్యోగాన్ని కాపాడుకోవాలని, గనిలో అందరితో కలిసిమెలిసి ఉంటూ పని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్లు, సివిల్ డీజీఎం పద్మరాజు, డీవైపీఎంలు రవీందర్‌రెడ్డి, మారుతి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, పీవో రాజేశం పాల్గొన్నారు.

స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి



కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియాలో సివిల్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు మేషన్స్, కార్పెంటర్స్, ప్లంబర్స్, వాల్ ఆపరేటర్లకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. గతంలో సింగరేణి యాజమాన్యం స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేసి, రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటి మొండి వైఖరి అవలంబిస్తే పని చేయడానికి కార్మికులు దొరకరని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు సదయ్య, రమేశ్, శ్రీనివాస్, వెంకన్న, రాజు తదితరులున్నారు.

ఈపీ టెక్నీషియన్లకు వెబ్ కౌన్సెలింగ్

గోదావరిఖని: ఈపీ టెక్నీషియన్లకు శుక్రవారం ఆర్జీ–1 టీటీసీలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రామగుండం రీజియన్‌కు సంబంధించిన ఈపీ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ సీనియర్, జూనియర్లు 169 మంది హాజరయ్యారు. సీనియారిటీ ఆధారంగా నచ్చిన ఏరియాలో ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, డీవైఎస్ఈ రాజన్న, టీటీసీ డీజీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసన తెలపండి


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ పర్యటనకు వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. శుక్రవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని రెండోసారి అధికారంలో వచ్చిన తర్వాత దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు, ఇతర ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని, దీనివల్ల కార్మికులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ రద్దు చేయొద్దు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ రద్దు చేయొద్దని హెచ్ఎంఎస్ ఆర్జీ–3 ఏరియా బ్రాంచి సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో కోరారు. కార్మికులకు 8 గంటల పనిదినాలతోపాటు కనీస వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్లు చట్ట విరుద్ధంగా సీఎంపీఎఫ్‌ను రద్దు చేయాలని చూడడం సరికాదని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా బాధ్యత తీసుకొని, అలాంటి వారికి టెండర్లు ఇవ్వకుండా చూడాలన్నారు.

ఐఎన్‌టీయూసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వికాస్



గోదావరిఖని/జ్యోతినగర్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వికాస్‌కుమార్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు ఎ.సత్యజిత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, జాతీయ కార్యదర్శి బాబర్‌పాషా చేతులమీదుగా శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

రేపు ఓదెల మల్లన్న పెద్ద పట్నం


అగ్నిగుండాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ మల్లేశంయాదవ్, ఈవో సదయ్య

ఓదెల: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం పెద్ద పట్నం బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ధూపం వీరభద్రయ్య ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపస్థాపన వీరభద్రారాధన కార్యక్రమాలు జరగుతాయి. రాత్రి 8 గంటలకు శ్రీభద్రకాళి ఆవాహన, 10 గంటల నుంచి 100 మంది ఒగ్గు పూజారులచే ఒగ్గుడోలు ప్రదర్శనల మధ్య 12 గంటలలోపు స్వామివారికి పెద్ద పట్నం పూర్తవుతుంది. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండాలు, అనంతరం దక్షయాగ కథాశ్రవణం గెలుపు ఉత్సవం, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయి.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తులకు నీడ, ప్రత్యేకంగా గదులు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించారు. సికింద్రాబాద్, బల్లార్షా, మహారాష్ట్ర, కాజీపేట, భద్రాచలం నుంచి ఓదెలకు సిర్పూర్–కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీ, సింగరేణి, భాగ్యనగర్, రామగిరి ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం ఉంది. కరీంనగర్, గోదావరిఖని, హుజూరాబాద్ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు జాతర వరకు నడుస్తాయి. ప్రైవేట్ వాహనాలకు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి ఓదెల వరకు తారు రోడ్డు సౌకర్యం ఉంది.

విజయవంతం చేయండి

మల్లికార్జునస్వామి పెద్ద పట్నం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్య కోరారు. శనివారం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం ఆవరణలో అగ్ని గుండాల ప్రదేశాన్ని పరిశీలించారు. పాలకవర్గ సభ్యులు రమేశ్, శ్రీకాంత్‌గౌడ్, మొండయ్యగౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర దంపతులకు బీఆర్ఎస్ నాయకుల స్వాగతం

పాలకుర్తి: మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుతూ మహారాష్ట్ర నుంచి ప్రగతిభవన్ వరకు సంకెళ్లతో పాదయాత్రగా వెళ్తున్న దంపతులకు శుక్రవారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. కన్నాల, జీడీనగర్ గ్రామాల పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఖాదర్‌పాషా, దండుగుల లక్ష్మణ్, నాయకులు జహీర్, పర్శరాం, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సామాజిక సేవలు అభినందనీయం


ఉపకరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థ ప్రభావిత, పునరావాస గ్రామాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో సీఎస్సార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రూ.4 వేల పింఛన్ అందిస్తూ ఆసరాగా నిలిచామని తెలిపారు. యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందించి, అవకాశాలు కల్పించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, మహిళలను కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలని సూచించారు. అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాలకు చెందిన 95 మంది దివ్యాంగులకు రూ.20 లక్షల విలువైన వివిధ రకాల 195 ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్, జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర ఠాకూర్, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు, సీఎస్సార్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు వస్తేనే పట్టించుకుంటరా?

- ఎన్టీపీసీలో ఉపకరణాల పంపిణీకి వచ్చిన దివ్యాంగుల ఇబ్బంది


ఎమ్మెల్యే వస్తుండటంతో దివ్యాంగురాలిని వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో శుక్రవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి పలువురు దివ్యాంగులు వచ్చారు. సమావేశ హాలు రోడ్డుకు దూరంగా ఉంటడంతో వారు ఇబ్బంది పడుతూ సహాయకుల సాయంతో చేరుకున్నారు. కాళ్లు సరిగా లేక నడవలేని వారు కోసం రోడ్డు వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేయకపోవడంతో నానాతంటాలు పడ్డారు. ఎమ్మెల్యే చందర్ వస్తున్న దారిలో ఓ దివ్యాంగురాలు ఇబ్బంది పడుతూ వస్తున్న విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్వాహకులు హడావుడిగా వీల్‌చైర్ తీసుకువచ్చారు. అనంతరం ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి, లోపలికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు వస్తేనే పట్టించుకుంటరా? లేకపోతే బాధితులను అలాగే వదిలేస్తారా అంటూ దివ్యాంగులతో వచ్చిన సహాయకులు కార్యక్రమ నిర్వాహకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్టీపీసీ జ్యోతిక క్లబ్ ప్రధాన కార్యదర్శిగా రాజనర్సయ్య


రాజనర్సయ్య

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికలో ఎం.రాజనర్సయ్య గెలుపొందారు. శుక్రవారం క్లబ్ ఆవరణలో ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికలో రాజనర్సయ్య ఫుట్‌బాల్, వేముల కృష్ణయ్య గడియారం గుర్తులపై పోటీ చేశారు. 613 ఓట్లకు గాను 403 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపు అనంతరం రాజనర్సయ్యకు 261, కృష్ణయ్యకు 140 ఓట్లు రాగా 121 ఓట్ల మెజారిటీతో రాజనర్సయ్య విజయం సాధించినట్లు ప్రకటించారు. రెండు ఓట్లు చెల్లలేదు. గెలుపొందిన రాజనర్సయ్యను పలువురు అభినందించారు. వైస్ ప్రెసిడెంట్‌గా వి.రాములు, జాయింట్ సెక్రటరీగా ఆర్.సంపత్, కమిటీ సభ్యులుగా కందుల సత్తయ్య, ఆర్.సాంబయ్య, వి.అశోక్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

900 గ్రాముల గంజాయి పట్టివేత



జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని టాస్క్‌పోర్స్, ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. పీకే రామయ్యకాలనీలో గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రామగుండం టాస్క్‌ఫోర్స్, ఎన్టీపీసీ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన స్థానికుడు జూల రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 900 గ్రాముల గంజాయి లభించింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న దురాశతో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, స్థానిక యువత, కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపారు.

ట్రినిటీ ఫార్మసీ కాలేజీలో యువ ఉత్సవ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: యువత అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటీ ఫార్మసీ కాలేజీలో శుక్రవారం జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి ఆయనతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి హాజరయ్యారు. యువత విద్యతోపాటు క్రీడలు, సంగీతం, యోగా లాంటి అంశాల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్స్, మెమెంటోలు, నగదు బహుమతి అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ఏవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రభాకర్, లెక్చరర్లు పాల్గొన్నారు.